

# పురో రోమన్ హాలిడే

మజుందార్

బొంబే సిటీలో థర్టీటూఅప్ లోనుంచి దిగినప్పుడు నాకు తెలియదు యీ మహానగరంలో నాగరికత నాకో పాఠం నేర్పుతుందని, నా వంటూ చెప్పుకునే ఓ కథ ఏర్పడుతుందని. యమ్మెస్సీ చేసింది విశాఖపట్టణంలో నయినా చాలా మంది స్టూడెంట్స్‌లా నాకు 'జాలరి పేట సంస్కృతి' పట్టుబడలేదు. అది నేను జీర్ణించుకోనుంటే జీవితాన్ని నేనూ చాలా 'లయిట్'గా తీసుకుని వుండేవాడిని.

*                *                *

గుంటూరులో ఉద్యోగం కాకపోయాక హాయిదరాబాదయితేనేం, బొంబే అయితేనేం అనే నమ్మకంతో యీ మహానగరం వచ్చిపడ్డాను మరో మాటల్లో చెప్పాలంటే, యిక్కడ ఆధిక్యత ఫీలయ్యే తెలుగువాళ్ళు కాదన్నా సరే, పొట్ట చేత్తోపట్టుకొని వచ్చారు. యాంత్రికమయిన బొంబే ప్రజల జీవితం నాలుగుభాగాలుచేస్తే రెండుభాగాలు ఆఫీసుల్లోను, ఉద్యోగవిధుల్లోను, ఒక భాగం ఎలక్ట్రిక్ ట్రెయిన్స్‌లోను, మిగతాది రేషన్ షాపులముందు క్యూల

లోను, కాస్తో కూస్తో యింకా మిగిలితే విశ్రాంతిలోనూ పోతుంది. ఇక వారికి జీవితం గురించి ఆ మాటకొస్తే దేన్ని గురించీ ఆలోచించే వ్యవధిగాని ఓపిక గాని అసలుండవు.

లాడ్జి అద్దెమంచంమీద పడుకొని సరిగ్గా యిదే ఆలోచిస్తున్న సమయంలో సుడిగాలిలా వచ్చాడు తానేజా "గెటప్ రావ్?" అంటూ. మంచంమీద లేచి కూర్చుంటూ, దగ్గరున్న తట్టి మంచం దగ్గరగా జరిపాను. తానేజా కూడా నే చేస్తున్న 'ఫర్మ్' లోనే ఉద్యోగం. నాకు నిజం చెప్పాలంటే బాంబేలో తెలుగు మిత్రులే తక్కువ. ఉన్నవాళ్ళ కన్నా తానేజా అంటేనే నా కిష్టం. తానేజా సింధీవాడు. అందరు సింధీ వాళ్ళలానే ముందుకు చొచ్చుకుపోగల నేర్పున్నవాడు. తానేజాకు ఒక్క ఉద్యోగమేగాక, మరికొన్ని ప్రక్క వ్యాపారాలు కూడ వున్నాయి.

"ముందు కమ్మని 'చాయ్' తెప్పించు. నీదోయ్ అదృష్టమంటే!" అన్నాడు అసలు విషయం దాస్తూ.

శివసేనకు భయపడి కట్టుకున్న లుంగీలోంచి పాంటులోకి దూరి పోయాను. లాడ్జికి ఎదురుగావున్న యిరానీహోటల్ వయిపు దారితీసాము. కుర్చీలో కూర్చుంటూ అడిగాను 'కాయ్ విశేష్ సాంగా!' అంటూ వచ్చీరాని మరాఠిలో కావాలని. నా మాటలకు కాబోలు నవ్వుతూ అన్నాడు.

"రావ్! తంతే పోయి గారెల బుట్టలో పడ్డట్లు నీకొక పేయింగెస్ట్ ఎకామడేషన్ సంపాదించాను."

"వ్వాట్?" అరచినట్లుగా నే అన్నాను.

"అవును రావ్! మాతుంగాలో. చర్చ్‌గేట్ రావటానికి అక్కడే లోకల్ కూడ కాచ్ చెయ్యొచ్చు. అదీగాక మీ మద్రాసీలు చాలామంది వున్నారు... ఐమీన్ మీ ఆంధ్రాలు..ఆ ప్రాంతంలో" అన్నాడు, అదేదో పెద్ద సౌకర్య మయినట్లు. అతనికి తెలీదు పాపం! ఒక తెలుగువాడు మరో తెలుగువాని ముందు, సుపీరియారిటికోసం పరాయి రాష్ట్రాల్లో ఎలా ప్రాకులాడుతాడో! మన తెలుగువాళ్ళదగ్గరవున్న దుర్గుణమే యిది. వాళ్లు గొప్పవాళ్ళమనుకొని సంతృప్తిపడలేరు. అవతలివాళ్లు ఎందుకూ పనికిరానివాళ్లు అనుకోవటంలో ఎక్కువ తృప్తి పొందుతారు.

"మంచి వాళ్ళేనా?"

"భలే వాడివే! చాలా పెద్దఫామిలీ. మహారాష్ట్రియులే. నీ యిబ్బందులు వాళ్ళకి చెప్పి వప్పించాను అతికష్టం మీద."

"థాంక్యూ వెరీమచ్" అన్నాను. అప్పుడు ప్రయివేటు ఎకామడేషన్ ఆఖరికి 'ఆరే మిల్క్ కాలనీ' వద్ద దొరి

కినా వెళ్ళేట్లున్నాను. ఈ లాడ్జిల్లో, చపాతీలు తింటూ, అద్దెమంచాలమీద కాలం దొర్లించటం దుర్భరంగావుంది

మరురోజు సాయంకాలం వాళ్ళింటికి వెళ్ళాము. వాళ్ళు దేశపాండేలుట. వాళ్ళ యిల్లు ఓ చిన్నసయిజు బంగళా అనే చెప్పాలి. కాపోతే మేడమీద రెండే గదులున్నాయి. వాటిల్లో ఒకాటి నాకిచ్చారు. మరో గదిలో వాళ్ళమ్మాయి నీత ఉంటుంది. ఆమె వాడియా కాలేజీలో పి. డి. కోర్సులో వున్నదిట. పెయింగెస్ట్ గా చేరిన కొత్తలో చాలా బిడియంగా, ముభావంగా, వుండేవాడిని. కాని వాళ్ళిచ్చిన చనువుతో వాళ్ళలో ఒకనిగా కలిసిపోయాను. నీత, నాతో తెలుగు అమ్మాయిలలా కాకుండా కలుపుగోలుగా చనువుగా వుండేది. తెలీనివి ఎన్నో చెప్పించుకుంటుండేది. బంధూ అనిపిలుస్తూ స్వంత అన్నలాగ చూసుకునేది. వాళ్ళింట్లో ఎంతస్థానం సంపాదించానంటే ఇల్లు నా మీద విడిచి అందరూ వెళ్ళిపోయిన సందర్భాలు గూడ వున్నాయి. నా దినకృత్యాలలో ముఖ్యమయినవి దేశపాండేగారితో 'చెస్' ఆడటం, నీతకు అడిగితే అర్థం కాని లెస్సన్స్ చెప్పటం.

ఇదంతా కథకు ఉపోద్ఘాత మనుకుంటే, అసలు కథంటూ వుందని మీరంగీకరిస్తే అది సరిగా యిప్పుడే ప్రారంభమయింది.

ఒక శనివారం సాయంకాలం సూర్యుడు 'పాలీహిల్స్' వెనుక మాయమయ్యే వేళ, యిరుకు గదుల్లోని మనుషులు బయటపడి 'చౌపాతీ' చేరేవేళ నేను ఇంటి గేటు తీసుకుని కాంపౌండ్ లో అడుగు పెట్టాను. మెట్లన్నీ ఎక్కి నేరుగా నా గదిలోకి వెళ్ళబోయి ఒక సెకను ఆగిపోయాను. ఆ గదిలో నీత గాక నీతలాటి అమ్మాయిలు మరో యిద్దరున్నారు. ముగ్గురూ కుర్తాలు వేసుకొని కాలేజీడ్రస్సుల్లోనే వున్నారు. వాళ్ళంతా వుండటంవలన గది కొంక అందమొచ్చింపని ఆ క్షణంలో అనిపించినా, శాశ్వతమయితే బావుండునని తరువాత తరువాత అనిపించకపోలేదు. కార్పెట్ మీద పడుకుని 'ఈవ్స్ వీక్లీ' కాబోలు చూస్తున్న వాళ్ళంతా నన్ను చూసి ఉలికిపడి లేచికూర్చున్నారు.

నీత నన్ను వాళ్ళకు పరిచయం చేసింది.

"వీళ్ళు నా క్లాస్ మేట్స్ రావ్! ఇది లీలాదేశాయ్, ఇది దామిని ... మా యింట్లో ఉన్నారని చెప్పానే మద్రాసీ ... ఈయనే!"

నన్ను వాళ్ళకు పరిచయంచేసిన పద్ధతి నవ్వు తెప్పించినా కోపంకూడా వచ్చేట్లు చేసింది.

"చూడు బాయీ! మీకు జనరల్

నాలెడ్జ్‌కు సంబంధించిన సబ్జక్ట్స్ ఏవన్నా వుంటాయా?" నవ్వుతూ అడిగాను, 'సై' నాట్ వదులు చేసుకుంటూ.

"లేకేం? వుండేవి."

"మరి నేను ఆంధ్రానుంచి వచ్చానని - ఆంధ్రు డంటారని నీకు నిజంగా తెలియదూ! దక్షిణ ప్రాంతంనుంచి వచ్చిన అందరూ మద్రాసీలేనా మీ దృష్టిలో?" తెచ్చిపెట్టుకున్న కోపంతో అడిగాను. "మేం ఆంధ్రులం ... మద్రాసీలము కాము. తెలిసిందా?"

"య ... య ..."

"ఏమిటి తెలిసింది?"

"మీరు ఆంధ్రులు ... కదూ!"

"మరెప్పుడయినా మద్రాసీ లంటావా?" సుతారంగా చెవి పట్టుకున్నాను.

"ప్లీజ్...రావ్ అననుగా, ప్రామిస్!" అంది.

ఈవెనింగ్ డ్రస్ తీసుకుని బాత్ రూంలోకి వెళ్ళాను. బయటకొచ్చేసరికి గదిలో ఒకమ్మాయి మాత్రమే వుంది. అంత అందమయిన అమ్మాయిలను నాకు బుద్ధి తెలిసాక చూడలేదు.

"వాళ్ళేరి?" అన్నాను పలుకరించాలని.

"నీత క్రిందకు వెళ్ళింది. దేశాయ్ నీత గదిలోకి వెళ్ళింది. నేనిక్కడే వున్నాను." నవ్వుతూ అంది.

ఒక నిముషం నిశ్శబ్దంగా దొర్లింది. మా సంభాషణ ఆగిపోవటం నాకిష్టం లేదు.

"మీ పేరు ... క్షమించాలి మరిచిపోయాను ..." నిజంగానే ఆమె పేరు గుర్తురాలేదు.

"దామినీ మిరచందాని. ఆడపిల్లల పేర్లు అంత త్వరగా మరిచేపోయే వాళ్ళను మిమ్ములను ఒక్కరినే చూసాను" అంది.

నీత ఫ్ల్యాన్ థోట్లేచేత ట్రే పట్టించుకొచ్చింది. దేశాయ్ అన్న అమ్మాయి కూడ గదిలోకి వచ్చింది.

"ఇది చాయ్ ... మీ యిద్దరకు ... యిది కాఫీ రావ్ కు..." వాళ్ళింట్లో కాఫీ ఎవరికీ అలవాటులేకపోయినా నా ఒక్కడికోసం రోజూ కాఫీచేసి పంపిస్తారు. ఇది వాళ్ళ మంచితనానికి ఒక నిదర్శనము మాత్రమే.

"ఏమిటో ఆయన స్పెషాలిటీ?"

"ఆయనకు చాయ్ అలవాటు లేదుట ...కాదుట."

"భలేవారే...టీకన్నా కాఫీ పాయిజనస్ అండి...మీకు తెలీదూ? ఇవాళే మాకు 'హైజీన్' క్లాస్‌లో చెప్పారు. దానిలో 'కెఫిన్' అనే స్లో పాయిజన్ వుంటుందిట. ఇవాళ 'టీ' త్రాగండి చూద్దాం..." చేతిలోంచి లాక్కున్నంత పనిచేసి, నా చేతిలో టీ కప్పు వుంచింది. ఆమె అందం, మాటకారి



తనం నంచుకుంటూ టీ పూర్తిచేసాను. నీత నవ్వుతూ చూస్తున్నది. ఆడవాళ్ళు మానసికంగా త్వరగా ఎదుగుతారని ఎవరో అన్నమాటలు ఆ క్షణంలో నిజమనిపించాయి.

"మా రావ్ యమ్మెస్సీ...తెలుసా?" అమాయకంగా, గర్వంగా చెప్పుకుంటున్న నీతమాటలకు యమ్మెస్సీ పుచ్చుకున్నందుకు మొదటిసారిగా గర్వించాను. ఆ నిముషంలో నాకు చెప్పాలనిపించలేదు– ఎంతోమంది యమ్మెస్సీలు ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజి చుట్టూ తిరుగుతున్నారని.

"అయ్-య్యో!" వేళ్ళ కొనలకు వేళ్ళు తగిలించిన దామిని చేతులు గుండెలమీదకు వెళ్ళాయి. చేపల్లాంటి కళ్ళు మరింత వెడల్పయ్యాయి. పెదాలు రెండూ కలిసి 'సున్నా'లాగా అయింది. ఆ భంగిమలో దామినిని ఎన్ని యుగాలయినా చూస్తుండవచ్చనిపించింది.

"నా స్టడీస్‌లో రావ్ చాలా హెల్ప్ చేస్తారు."

"నే...నో...రావ్ గారూ! ఇకనుంచి మాక్కూడా చెప్పాలండి...ప్లీజ్ ప్రతి ఆదివారం రామా ?" మారాం చేస్తున్నట్లుగా అంది దామిని.

నాకు చాలా ఉత్సాహంగా వుంది. ఏదో మాట్లాడాలని అనిపిస్తుంది. ఆ రోజు దామిని తీసుకున్న చనువుకు ఎన్నో రోజుల పరిచయం వున్నట్లనిపించినా తరువాత నిజంగానే ఆ పరిచయం ప్రేమలోకి మారటానికి ఎంతో కాలం పట్టలేదు.

*  *  *

చాలా ఆదివారాలు నాకు తెలీకుండానే, నా ప్రమేయం లేకుండానే గడిచిపోయాయి. నేనూ దామినీ కలిసి గేట్ వే, మలబార్ హిల్స్, హేంగింగ్ గార్డెన్స్, ఎలిఫెంట్ కేవ్స్, పొవాయి లేక్, ఒహ్ ! తిరగని ప్రదేశంలేదు. రెండాదివారాల మధ్య ఆరు రోజులు ఆరు యుగాలనిపించేది.

ఆరోజు ఆఫీసుకు ఫోన్ చేసింది వాళ్ళింటికి "టీ"కి రమ్మని. అక్కడ నుంచి 'పిక్చర్ ప్రోగ్రాం' అని. బాస్‌నడిగి తొందరగా వెళ్ళాను. ట్రిమ్‌గా తయారయి దామిని వాళ్ళింటికి వెళ్ళాను. దామిని అమ్మగారుమాత్రమే వున్నారు యింట్లో. చాలా మర్యాద చేసారు. తర్వాత 'టివోలి' దగ్గరే కదా అని నడిచాము. రెండు బాక్స్ టిక్కెట్లు కొన్నాను; హాల్లో కూర్చున్నా-సినిమా చూస్తున్నా నా ఆలోచనలన్ని గులాబి రంగు చీరలో మెరిసిపోతున్న దామిని వయిపే పరుగులు తీస్తున్నాయి. ఇంత అందమయిన ఆడపిల్లతో . ఒహ్! తీయని వూహాలు చేస్తున్న సందడికి భయపడి ఆసరాకు నాచేయి దామిని భుజాల మీదకు ప్రాకింది. వేడినిట్టూర్పులమధ్య సినిమా అయిపోయిం దనిపించి బయట పడ్డాము. అద్దంలో ప్రక్క ప్రక్కన నడుస్తున్న మా ప్రతిబింబాలు అలా శాశ్వతంగా నిలిచిపోతే బావుండు నని పించింది.

"దామినీ! అలా బీచ్ వయిపు వెళ్దామా?" దామిని చేయి చేతిలోకి తీసుకుంటూ అడిగాను. నా వయిపు నవ్వుతూ చూసింది. మాతుంగాలోని "లవర్స్ బీచ్"కి వెళ్ళాం. తడి లేని చోట యిసుకలో కూర్చున్నాము.

రాత్రి తొమ్మిదయుంటుంది. చంద్రుడు వెన్నెల కురిపిస్తున్నాడు. ఆ వెన్నెల గిలిగింతలకు కాబోలు సముద్రం కేరింతలు కొడుతున్నది. సముద్రంమీదనుంచి చల్లటిగాలి మనసును చల్లగా తాకుతున్నది.

దామిని నా ప్రక్కన యిలావుంటే ఏదయినా చేయగలననిపిస్తున్నది. ప్రకృతీ పరిసరాలు ఎంత అందంగా వున్నాయని! జీవితం ఎంత ఛార్మింగ్‌గా



వుందనీ! బహుశా ప్రతి ప్రేమికుడికి యిలాగే వుంటాయేమో భావాలు!

"దామినీ, నిన్ను చూస్తుంటే బ్రహ్మదేవుడిమీద కోపం వస్తున్నది," అన్నాను తన చేయిమీద మెల్లిగా రాస్తూ.

"ఎందుకో! అందంగా పుట్టించలేదా నన్ను?" ఆడవాళ్ళు తమ అందం గురించి మగవాళ్ళు చెబితేగాని నమ్మరేమో!

"ఊహుఁ, అందుకుగాదు. బ్రహ్మదేవుడు అందమంతా నీలో పొదిగి ఎంతమందికి అన్యాయం చేశాడో కదా అని!"

6

"యూ నాటీ..." అంది తన తల నా భుజంమీద పెట్టుకుంటూ. దామిని వెచ్చని శ్వాస నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నది. మనసు సముద్రంలోని కెరటాల్లా ఉద్వేగంగా వుంది. చంద్రుని వెన్నెలగూడ ఆ క్షణంలో వెచ్చగా వుంది.

"దామూ, ఎందుకింత అందంగా వున్నావ్?" నా వడిలో తలపెట్టుకుంటున్న దామిని నీలికళ్ళల్లోకి చూస్తూ అన్నాను.

దామిని ఏం మాట్లాడలేదు. ఒక నిముష మయ్యాక మెల్లిగా అంది నా పెదిమక్రింద చూపుడు వ్రేలుతో రాస్తూ.

"రావ్! నేనంటే నీకంత ఇష్టమా?"

ఈ స్వీట్ నథింగ్స్‌కు అర్థా లేముంటాయి? చంద్రుడు సిగ్గుపడి కాబోలు మబ్బుల వెనక దాగున్నాడు పోయి.

* * *

దామిని నా మనసులో ఎంత స్థానమాక్రమించుకున్నదంటే, తనను విడిచి ఒక్క నిముషం గడపటంకూడ దుర్భరంగా వుంది. తను దగ్గర లేక పోతే ఏదో వెలితి. ఇంతకుముందు ఆడవారాలు, ఆ మాటకొస్తే అసలు జీవితం అంత నిస్సారంగా ఎలా గడపగలిగానో ఆశ్చర్యంగా బాధగా వుంది. కాబోయే భార్య ఎలా వుండాలో కన్న ఎవరయి వుండాలో అన్న ప్రశ్నకు సమాధానం దొరికింది. ఎన్నోసార్లు యీ విషయం దామినిని అడుగుదామని అనుకుంటూనే తనని చూసి మరిచిపోతుండేవాడిని. మన తెలుగు ముద్దబంతి పూవును ఎవరినీగాక మరో రాష్ట్రంలో మరో తెగ అమ్మాయిని చేసుకుంటానంటే... యింట్లోవాళ్ళు ఒప్పుకుంటారా అన్నదే సమస్య. కాని నా ఉద్యోగం, నా జీతం, దామినితో నా స్నేహం, ప్రేమా ఆ సమస్యను సమస్యగా చిత్రించటానికి అడ్డు వస్తున్నాయి.

నా ఆలోచనలు భంగంచేస్తూ నీత అరచింది క్రిందనుంచి, "నీకు ఫోన్... ఎవరో నీ ఫ్రెండట."

ఒక్క ఉదుటున క్రిందకువెళ్ళి రిసీవర్ చేతిలోకి తీసుకున్నాను.

"రావ్ హియర్."

"ఓహ్, మై రావ్." అది దామిని గొంతు. నాకా గొంతు వింటే ఎవరో గంధర్వులు శ్రుతి సరిచేసుకుంటున్నట్లుంటుంది. సాయంత్రం మెరీన్ డ్రైవ్‌లో కలుసుకోమని అభ్యర్థన అది. రిసీవర్ క్రెడిల్‌మీద పెట్టేసి, పరుగు తీయని కాలంకేసి చూస్తూ కూర్చున్నాను. ఇవాళ దామినిని పెళ్ళి విషయం అడగాలి. మనసులో అనుకున్నాను మగవాని బలహీనతే అదేమో. ఆజ్ఞ శిరసావహిస్తున్నట్లు మెరీన్ డ్రైవ్‌కు చీకట్లు ముసుగు సవరించు

కునే వేళ వెళ్ళాను. అప్పటికే దామిని ఎదురు చూస్తున్నది. నీలంరంగు షిఫాన్‌లో అందంగా మెరిసిపోతున్నది. చెవిరింగులు, తలకు స్కార్ఫ్ నుంచి కాళ్ళకు చెప్పులదాక నీలంరంగులో వున్న దామిని ఆకాశరాజు పుత్రికలా వుంది. చూపు ఓ నిముషం మరల్చుకో లేకపోయాను.

"తర్వాత చూడవచ్చుగాని తిరిగ్గా..." మిగతా మాటలు పూర్తి చేయకుండా దిల్‌మార్ రెస్టారెంట్‌లోకి దారితీసింది. పైకి పోతున్న లిఫ్ట్‌లో దామిని గులాబిరంగు చెక్కిళ్లు స్పృశిస్తూ అన్నాను, "నీతో ఓ ముఖ్య విషయం మాట్లాడ్తాను యివాళ." దామినికూడ నవ్వుతూ అంది, "నేనూ అందుకే యిక్కడకు రమ్మంది. నేనూ ఓ ముఖ్యమైన సంగతి చెప్తాను." నవ్వుకుంటూ హోటల్లోకి దారితీసాము.

టేబుల్‌కు యిరువైపులా ఎదురెదురుగా కూర్చున్నాము. వచ్చిన బేరర్‌కు ఏవో అయిటమ్స్ డిక్టేట్ చేస్తున్నది. హోటల్ గాజుకిటికీలోంచి మెరీన్ డ్రైవ్ క్రింద సముద్రం నీలంగా అందంగా వుంది. దూరంగా ఏదో షిప్ కనబడుతున్నది. డయాస్ మీదనుంచి సన్నని గిటార్ శబ్దం శ్రావ్యంగా వినబడుతున్నది. క్రీమ్ లయిట్ సన్ననికాంతి దామిని గుండ్రని భుజాలపైన పడి వాటి నునుపుతనం తెలుపుతున్నది.

"హలో దామినీ, యిక్కడ కూర్చున్నావా? టేబుల్ సెవెన్ అన్నావే!" అన్నమాటలకు యీ లోకంలోకి వచ్చాను. అతను ఎత్తుగా అందంగా ఫుల్‌సూట్‌లో వున్నాడు. చెంపలదాకా జుట్టు, సన్నటిగడ్డం. మనిషి బలంగా హుందాగా వున్నాడు. మరో కుర్చీలో కూర్చుంటూ "సో సారి... లేటయింది" అన్నాడు.

అక్కడక్కడ ఫోర్కులు, స్పూనుల శబ్దంతప్ప ఏం వినపడటంలేదు. హోటలంతా నిశ్శబ్దంగా ప్రశాంతంగావుంది.

"రావ్, నీకొక ముఖ్యమైన సంగతి చెప్తానన్నానుగదూ," దామిని నిశ్శబ్దం భంగం చేస్తూ అంది. నేను తలూపాను. అతన్ని పరిచయం చేసుకోవాలని నేను ఆత్రంగా ఎదురు చూస్తున్నాను.

"మీట్ మై బాయ్ ఫ్రెండ్ - రావ్!" నన్ను పరిచయం చేసిందతనికి. ఆ సంబోధనకు నవ్వుకుంటూ చేయి ముందుకు జాపాను.

"హి యీజ్ అహుజా......మై ఫియాన్స్"

నాకు షాక్ కొట్టినట్లయింది. సభ్యత గాదని, "ప్లీజ్డ్ టూ మీట్యూ" అని నా చేతిని తనచేతిలోకి తీసుకున్న అతన్ని విదిలించుకోలేక పోయాను. కళ్ళముందు జుహూలు, చౌపాతీలు, మరాఠ

మందిర్‌లు, టివోలీలు గిర్రున నాచుట్టు తిరుగుతున్న అనుభూతి కలిగింది. అసహనంగావుంది. మనసు కోపంతో, అవమానంతో ఉడికిపోతున్నది.

“మీ గురించి దామూ చెప్తాంటుంది...” అతని మాటలకు దామిని నవ్వుతున్నది. మనసంతా చిరాకుగా వుంది. చెప్పలేనంత కసిగావుంది. అందుకనే ఏం మాట్లాడలేదు. కాఫీ కలుపుతూ అంది దామిని, “రావ్! నీవేదో ముఖ్య విషయం చెబుతానన్నావ్?” ... దామిని నీలికళ్ళలోకి సూటిగా చూసాను. “ఏంలేదు ... ఏంలేదు ... అంతా ఒక జోక్” అన్నా లేనినవ్వు తెచ్చిపెట్టుకుంటూ.

నాకింక అక్కడ నిలవబుద్ధికాలేదు. దామినిని చూస్తుంటే అసహ్యం వేస్తున్నది. అందుకే “ఫిర్ మిలేంగే” అని బయటపడ్డాను. బాంబే నగరమంతా సందడిగా, గందరగోళంగా పరమ ‘న్యూసెన్స్’గా వుంది.

* * *

అందుకే అన్నాను వీటిలో మొదటి సారి దిగినప్పుడు నాకు ఈ సిటీ నాగరికత తెలీదని, అది నేర్చేపాఠాలు వున్నాయని.

ఇక్కడ ఆడపిల్లలకు ఎంతమంది ‘బాయ్‌ఫ్రెండ్స్’, వీలయితే, పర్సు బరువుగా వున్నవారు వుంటే అంత గౌరవమని, గర్వకారణమనీ. యీ నాగరికత నీడలో అంతా కొలత ప్రకారం నవ్వుతారని, అంతా కృత్రిమము, అభినయము అనీ దగాపడని తమ్ముళ్ళకు మంచిదని చెప్పినా, నేను యింటికి వెంటనే ఎక్స్‌ప్రెస్ డెలివరీలో ముద్దబంతి పూవులాటి ఓ తెలుగు పడుచును కుదర్చమని, నే చూడక్కర్లేదని వ్రాసానని ఎవరికీ చెప్పక్కర్లేదుగదా! ★

